సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023

అమాత్యుని పర్యటనపై ఆశలు



ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అక్టోబర్ 1న మంచిర్యాల జిల్లా పర్యటనకు రానున్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. 8లో▸



పునఃప్రారంభమైన రైళ్లు

మూడు నెలలుగా రద్దయిన రైళ్లు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు యథావిధిగా నడవనున్నాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1 /24.0

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. పలుచోట్ల ఉరుములతో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

1 నుంచి డీడీఎన్ అర్చకులకు శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో దూపదీప నైవేద్యం కింద పనిచేస్తున్న అర్చకులకు అక్టోబర్ 1 నుంచి 3 వరకు నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీగంగా సరస్వతీ దేవస్థానంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీడీఎన్ అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నిష్ణాతులైన పండితులతో పునశ్చరణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. కేటాయించిన తేదీల ప్రకారం అర్చకులు హాజరుకావాలని, శిక్షణలో పాల్గొన్న వారికి భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 94949 34924 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగావకాశం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పూర్తయిన విద్యార్థులకు ఎంఎస్ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగావకాశం, ఉచిత విద్యావకాశం కల్పిస్తున్నట్లు డీఐఈవో శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 60 శాతం మార్కులు, ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ)లో 50 శాతం మార్కులు కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. సైన్స్ విద్యార్థులను కంపెనీ ఉచితంగా బీఎస్సీ(కెమిస్ట్రీ) చదివిస్తుందన్నారు. ఆసక్తి గల వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అక్టోబర్ 11న నిర్వహించే ఇంటర్వ్యూలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు కంపెనీ ప్రతినిధులు 95156 60694, 91213 02871, 91548 29055 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు మంత్రి ఐకే రెడ్డి పర్యటన

కౌటాల(సిర్పూర్): సిర్పూర్ నియోజకవర్గంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు శుక్రవారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. మంత్రి ఐకే రెడ్డి ఉదయం 9 గంటలకు కాగజ్‌నగర్ చేరుకుని 10 గంటలకు సిర్పూర్ మండలంలో పర్యటిస్తారు. ఉదయం 11.30 గంటలకు కౌటాల మండలం గుండాయిపేట వద్ద వార్ధా నదిపై రూ.75 కోట్ల నిధులతో నిర్మించే అంతర్రాష్ట్ర వంతెనకు భూమి చేస్తారు. అనంతరం కౌటాల జగదాంబ ఫంక్షన్ హాల్ బీఆర్ఎస్ పార్టీ సమావేశం ఉంటుంది. అలాగే చింతలమానెపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు, కార్యకర్తలు మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఆర్యవైశ్య మహాసభ

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లో ఈ నెల 30న రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహాసభకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు తరలి రావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ వైశ్యుల కోసం వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఏళ్లు గడుస్తున్నా హామీని అమలు చేయలేదన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభ ద్వారా వైశ్య కార్పొరేషన్‌ను ప్రకటించేలా సీఎంను కోరాలన్నారు. రాష్ట్రంలోని వైశ్యులంతా సంఘటితంగా పోరాడి ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను సాధించుకోవాలని పేర్కొన్నారు.

ఉత్సాహంగా త్రోబాల్ ఎంపిక పోటీలు



తలపడుతున్న క్రీడాకారులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో త్రోబాల్, స్కేటింగ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీలకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. త్రోబాల్ అండర్–14, 17 విభాగంలో బాలబాలికలు మొత్తం 150 మంది, స్కేటింగ్‌లో అండర్– 11, 14, 17 విభాగాల్లో బాలబాలికలు 60 మంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

మరిన్ని పరీక్షలు..!

- తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో సేవలు మెరుగు
- 57 నుంచి 90కి పెరిగిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ఇక్కడికే శాంపిళ్లు
- పేదలపై తగ్గిన ఆర్థిక భారం



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో మరిన్ని వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ‘టీ హబ్’ ద్వారా ప్రజలకు ఉచితంగా పరీక్షలు చేస్తున్నారు. 57 రకాల పరీక్షలతో దీనిని ప్రారంభించారు. ప్రస్తుతం 134 రకాల నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి రాగా, 90 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో జిల్లాలోని పేదలపై ఆర్థిక భారం తగ్గింది.

తొలివిడతలోనే ఎంపిక

జిల్లాలో రెండు సీహెచ్‌సీలు, 20 పీహెచ్‌సీలు ఉండగా, వీటిలో షుగర్, బీపీ, క్షయ నిర్ధారణ పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. స్థానికంగా ల్యాబ్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు టెస్టుల కోసం మంచిర్యాల, చంద్రపూర్, కరీంనగర్ తోపాటు హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రైవేటులో అధిక బిల్లులతో ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఉచిత వ్యాధినిర్ధారణ పరీక్షలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా టీహబ్‌లు ఏర్పాటు చేసింది. తొలి విడతలోనే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎంపికైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో 2020 మార్చి 20న డయాగ్నొస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో తొలుత ప్రజలకు 57 రకాల వైద్యపరీక్షలు అందుబాటులోకి తెచ్చారు.

నాలుగు రూట్లలో శాంపిళ్ల సేకరణ

డయాగ్నొస్టిక్ కేంద్రంలో పనిచేసేందుకు నోడల్ అధికారిగా ఒక వైద్యాధికారితోపాటు ఎనిమిది మంది ల్యాబ్ టెక్నీషియన్లను నియమించారు. ప్రారంభంలో రెగ్యులర్ ల్యాబ్ మేనేజర్ లేకపోవడంతో కొంతవరకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం ల్యాబ్ మేనేజర్‌ను నియమించడంతో సేవలు మెరుగుపడ్డాయి. ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ముందుగా పీహెచ్‌సీల్లోని వైద్యులు రోగుల వ్యాధి నిర్ధారణ కోసం శాంపిళ్లు సేకరిస్తున్నారు. ప్రత్యేక వాహనంలో ఆ శాంపిళ్లను టీహబ్‌కు తరలిస్తారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం సెల్‌ఫోన్‌కు మెసేజ్ ద్వారా రిపోర్టు పంపిస్తారు. రిపోర్టు కాపీని కూడా ఆయా పీహెచ్‌సీలకు చేరవేస్తారు. పీహెచ్‌సీల్లో వ్యాధి నిర్ధారణ కోసం సేకరించిన రక్త నమూనాలను డయాగ్నొస్టిక్ కేంద్రానికి తరలించేందుకు నాలుగు రూట్లుగా విభజించారు. నాలుగు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి పీహెచ్‌సీల నుంచి శాంపిళ్లు కేంద్రానికి తరలిస్తున్నారు. వాంకిడి, అడ, లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూర్‌కు ఒక రూటు, రెబ్బెన, తిర్యాణి, రొంపెల్లి, గిన్నెధరి ఒక రూటు, కాగజ్‌నగర్, బెజ్జూర్, దహెగాం, సిర్పూర్(టి), కౌటాలను మరో రూట్‌గా విభజించారు. ప్రతిరోజూ పీహెచ్‌సీల్లో సేకరించిన శాంపిళ్లను జిల్లా కేంద్రంలోని డయాగ్నొస్టిక్ సెంటర్‌కు తీసుకువస్తున్నారు.

2,53,161 పరీక్షలు



జిల్లా కేంద్రంలోని డయాగ్నొస్టిక్ సెంటర్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రంలో ప్రతినెలా సుమారు రూ.15 లక్షల విలువ చేసే వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డయాగ్నొస్టిక్ కేంద్రంలో 134 రకాల నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా ప్రస్తుతం షుగర్, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్, బ్లడ్ షుగర్, విటమిన్ డి, విటమిన్ బి12, లివర్, కిడ్నీ తదితర 90రకాల పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు ఈ కేంద్రంలో 90,402 మంది పేషెంట్లను నుంచి 1,50,417 శాంపిళ్లు సేకరించగా 2,53,161 పరీక్షలు చేశారు.

టీహబ్‌లో ఇప్పటివరకు చేసిన పరీక్షలు

	పేషెంట్లు	సేకరించిన శాంపిళ్లు	చేసిన పరీక్షలు
2021	8,095	13,541	20,791
2022	51,564	82,411	1,35,370
2023	30,743	54,465	97,000

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కేంద్రంలోని డయాగ్నొస్టిక్ సెంటర్‌లో షుగర్, లివర్, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్‌తో పాటు 134 రకాల వైద్యపరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం 90 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతినెలా రూ.15 లక్షల విలువ చేసే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఇప్పటి వరకు 2,53,161 రకాల పరీక్షలు చేశాం. పరీక్షలు అవసరమున్న వారు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంప్రదించాలి. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– అర్జున్, డయాగ్నొస్టిక్ కేంద్రం మేనేజర్

గంగమ్మ ఒడికి గణనాథుడు



జిల్లా కేంద్రంలోని పెద్దవాగులో గణపతిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: విద్యుద్దీపాలు, సినిమా సెట్టింగ్‌లను తలపించే మండపాల్లో వాడవాడలా కొలువుదీరిన లంబోదరుడు గంగమ్మ ఒడికి చేరాడు. తీరొక్క నైవేద్యాలతో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణపయ్య.. సెలవిక అంటూ భక్తులకు వీడ్కోలు పలికాడు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జనం కనుల పండువగా సాగింది. యువతీయువకులు నృత్యాలు, కోలాటాలతో ఆకట్టుకున్నారు. బ్యాండు మేళాలు, డీజే చప్పుళ్లకు అనుగుణంగా కాలు కదిపారు. జిల్లా కేంద్రంలోని గణేష్ మందిర్ వద్ద నెలకొల్పిన నవయుగ గణేశ్ మండలి, కేశవనాథ మందిరంలో ఏర్పాటు చేసిన సార్వజనిక్ గణేష్ మండలి, పండరినాథ ఆలయం గణపతితోపాటు కసాబ్ వాడిలోని బాల అయ్యప్ప గణేష్ మండలి వద్ద నెలకొల్పిన వినాయకులను నిమజ్జనం చేశారు. కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.

వరించిన అదృష్టం

జిల్లా కేంద్రంలోని బజార్‌వాడి సంఘ సేవా గణేశ్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రాలో కౌటాలకు చెందిన పాలె హర్షవర్ధన్‌ను అదృష్టం వరించింది. రూ.250తో కూపన్ కొనగా కారు దక్కించుకున్నాడు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిలువేరు వెంకన్న, నాయకురాలు ఇరుకుల్ల మంగ చేతుల మీదుగా గురువారం తాళం అందుకున్నారు. నిర్వాహకులు కార్తీక్, నరసింహ, నిఖిల్, మహేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



కారు తాళం అందుకుంటున్న హర్షవర్ధన్



కెరమెరి: గణపతుల శోభాయాత్ర



జిల్లా కేంద్రంలో శోభాయాత్ర

కులమతాలకు అతీతంగా | పండుగలు జరుపుకోవాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: కులమతాలకు అతీతంగా ప్రజలు అన్నిపండుగలు జరుపుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభయాత్రలో పాల్గొన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం, శీతలపానీయాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి గణపతి, జిల్లా అధ్యక్షుడు మోర్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న ప్రవీణ్‌కుమార్

మిలాద్– ఉన్– నబీ శుభాకాంక్షలు

మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడుఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచమంతా శాంతి, సమానత్వంతో విరాజిల్లాలని, ప్రతీ ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్న మహోన్నత వ్యక్తి మహ్మద్ ప్రవక్త అని పేర్కొన్నారు.

‘ప్రజలను మభ్యపెట్టడానికే శంకుస్థాపనలు’

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజలను మభ్యపెట్టడానికే శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేయడానికి మంత్రులు సిర్పూర్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు, సీనియర్ నాయకుడు అమర్‌సింగ్ తిలావత్ ఆరోపించారు. కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2018 ఆగస్టు 30న అప్పటి మంత్రి జోగు రామన్న సిర్పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయగా, ఆ పనులు శిలాఫలకానికే పరిమితమయ్యాయని ఆరోపించారు. ప్రస్తుతం మళ్లీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అవే పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో శంకుస్థాపన చేసిన పనులు కూడా ప్రారంభానికే పరిమితమైనట్లు విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టడానికి సిద్ధమవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసపూరిత కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు వీరభద్రాచారి, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, గోలెం వెంకటేశ్, అశోక్, మాచర్ల శ్రీనివాస్, సుధాకర్, సొరబ్రాత్రిక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

‘కాంగ్రెస్ టికెట్ సరస్వతికే కేటాయించాలి’

వాంకిడి(ఆసిఫాబాద్): ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ మర్సుకోల సరస్వతికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం వాంకిడి మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. కుమురంభీం విగ్రహం నుంచి ర్యాలీగా వచ్చి బస్టాండ్ ప్రాంతం వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ టికెట్ సరస్వతిని కాదని వలసవాదులకు కట్టబెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలోని 80 వేల ఆదివాసీలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆసిఫాబాద్ ముద్దుబిడ్డ సరస్వతికి టికెట్ కేటాయిస్తే.. ఎమ్మెల్యేగా గెలిపించి చూపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉయికే రాము, విశ్వనాథ్, అయ్యూబ్ పఠాన్, గంగారాం, సోయం మోతీరాం, లింబరావు, లింగు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఏటా నష్టం.. అందని పరిహారం

- ‘ప్రాణహిత’ వరదలతో ఏటా నీట మునుగుతున్న పంటలు
- పది రోజుల క్రితం మరోసారి ఉప్పొంగిన నది
- నాలుగైదేళ్లుగా తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- సర్వేలకే పరిమితమవుతున్న అధికారులు
- పరిహారం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు



బెజ్జూర్ మండలంలో ఇటీవల వరదలకు దెబ్బతిన్న పత్తి చేను

బెజ్జూర్(సిర్పూర్): ప్రాణహిత నది తీర ప్రాంత రైతులకు ఏటా కన్నీళ్లే మిగులుతున్నాయి. కోటి ఆశలతో సాగు చేసిన పంటలను వరదలు ముంచుతుండటంతో నష్టపోతున్నారు. అధికార యంత్రాంగం సర్వేలు, పరిశీలనలకే పరిమితమవుతుండగా.. పరిహారం గురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. శుక్రవారం సిర్పూర్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్థానిక రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరుతున్నారు.

ముంచుతున్న ‘ప్రాణహిత’

నది పరీవాహక ప్రాంతాల్లో పంటలు సాగుచేస్తున్న రైతులను ‘ప్రాణహిత’ నట్టేటా ముంచుతోంది. జిల్లాలోని ఈ నదీ పరీవాహక మండలాల్లో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ప్రధానంగా పత్తి పూర్తిస్థాయిలో దెబ్బతిని రైతులు నష్టపోవాల్సి వస్తోంది. అధికారులు పంటల సర్వే చేపడుతున్నా ఇప్పటివరకు అన్నదాతలకు పరిహారం అందలేదు. మహారాష్ట్ర పరిధిలోని వార్ధా, పెన్‌గంగ నదులపై నిర్మించిన గోసికుర్జా, ఈసకుర, చిచాడ ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేసిన సమయాల్లో ఏటా పంట పొలాల్లోకి వరద చేరి నష్టాన్ని మిగుల్చుతోంది. సిర్పూర్ నియోజకవర్గంలోని దహెగాం, బెజ్జూర్, కౌటాల, చితలమానెపల్లి, పెంచికల్‌పేట్, సిర్పూర్(టి) మండలాల్లో నష్టం ఎక్కువగా ఉంటుంది.

అపార నష్టం..

జిల్లాలో ప్రధానంగా పత్తి పంట సాగులో ఉండగా, ఆ తర్వాత వరి సాగు చేస్తున్నారు. రెండు, మూడేళ్లుగా ప్రాణహిత నది పరీవాహక ప్రాంత రైతులను దెబ్బతీస్తోంది. పంట పొలాల్లో రోజుల తరబడి వరద నీరు నిల్వ ఉండడంతో మొక్కలు నల్లబారుతున్నాయి. ఈ ఏడాది కూడా రెండు, మూడు సార్లు సిర్పూర్(టి), బెజ్జూర్, పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం, చింతలమానెపల్లి మండలాల్లో తీవ్రస్థాయిలో నష్టం చేకూరింది. కౌటాల మండలంలోని పార్డి, తాటిపల్లి, తుమ్మిడిహెట్టి, గుండాయిపేట్, వీర్దండి, బెజ్జూర్ మండలంలోని తలాయి, సోమిని, తిక్కపల్లి, భీమారం, పాపన్‌పేట్, నాగవెల్లి, మోగవెల్లి, సుశ్మీర్, ఇప్పలగూడ, దహెగాం మండలంలోని మొట్లగూడ, దిగిడ, రాంపూర్, రావులపల్లి, దుబ్బగూడ, చింతలమానెపల్లి మండలంలోని గూడెం, దిందా, కేతిని, పెంచికల్‌పేట్ మండలంలోని జిల్లేడ, కుమ్మర్‌గాం, గుండెపల్లి, మోర్లిగూడ తదితర గ్రామాల్లో పంటలు పూర్తిగా నీటమునిగాయి. కౌటాల మండలంలో దాదాపు 500 ఎకరాలు, బెజ్జూర్‌లో 1400 ఎకరాలు, చింతలమనెపల్లిలో 300 ఎకరాలు, పెంచికల్‌పేట్‌లో 500, దహెగాంలో దాదాపు 600 ఎకరాలు నీటి పాలయ్యాయి.

పది రోజుల క్రితం మరోసారి..

ఈ నెలలో పది రోజుల క్రితం వర్షాల కారణంగా మహారాష్ట్రలోని ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేశారు. చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాల ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాల్లోకి మరోసారి వరద చేరింది. ఈ వర్షాకాలంలోనే రెండు సార్లు ప్రాణహిత ఉప్పొంగి పంటలు నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఒక ఎకరం పత్తి పంటకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. ఏటా పంటలు ప్రాణహిత ఉప్పొంగి ప్రవహించడం, వరదనీరు చేలల్లో నిల్వ ఉండడంతో రైతులు అప్పుల పాలై ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. మళ్లీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో వారిపై పెట్టుబడి భారం పడుతోంది. మరోవైపు అధికారులు దెబ్బతిన్న పంటలను సర్వే చేస్తున్నా పరిహారం విడుదలలో మాత్రం జాప్యం చేస్తున్నారు. ఇప్పటికైనా పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఏటా నష్టపోతున్నాం



పంట సాగుకు రూ.వేల పెట్టుబడి పెడుతున్నాం. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు ఏటా వర్షాలతో దెబ్బతిని నష్టపోతున్నాం. మహారాష్ట్రలో ప్రాజెక్టుల నీటిని వదలడంతో ప్రాణహిత నదిలో వరద పెరిగి పంటలు మునిగిపోతున్నాయి.

– రైతు సతీశ్, తలాయి, మం.బెజ్జూర్

పరిహారం అందలేదు



ప్రాజెక్టుల నుంచి నీటిని వదలడంతో పంటలు నీట మునుగుతున్నాయి. అధికారులు సర్వే చేస్తున్నారే తప్పా పరిహారం అందడం లేదు. ప్రతీ సంవత్సరం ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాం.

– పానేం రాములు, తలాయి, మం.బెజ్జూర్

‘కుటుంబ పాలనలో ఉద్యోగులకు అరిగోస’

బెజ్జూర్(సిర్పూర్): రాష్ట్రంలో కొనసాగుతున్న సీఎం కేసీఆర్ కుటుంబ పాలనలో ఉద్యోగులు అరిగోస పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశ వర్కర్ల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రతీ ఉద్యోగి రోడ్డుపైకి వచ్చి నిరసనలు, రాస్తారోకోలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పురుగుల మందుతాగి యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామానికి చెందిన బూర్ల వెంకటేశ్ (33) ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించేవారు. ఈ క్రమంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేశ్ కొద్దిరోజులు బంధువుల ఇళ్లల్లో ఉండి ఇటీవలే తిరిగివచ్చాడు. ఈ నెల 26న రాత్రి ఇంట్లోనే గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలకు, అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని సోదరుడు బానేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దొనబండ గ్రామానికి చెందిన కోట ప్రభాకర్ (47) కూలిపని చేసుకుంటూ భార్య మల్లవ్వతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. కొద్దిరోజులుగా మల్లవ్వ హాజీపూర్‌కు చెందిన సన్నిహితంగా ఉంటోందని గుర్తించి పలుమార్లు హెచ్చరించాడు. అయినా ఆమె ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి కోట లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడు గల్లంతు

బెజ్జూర్: మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన బండి వెంకయ్య (65) జేసీబీ తోడిన గుంతలో మునిగి గల్లంతయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు అందరితో కలిసి వెళ్లాడు. గుంతలో దిగి స్నానం చేస్తుండగా నీటిలో మునిగి గల్లంతయ్యాడు.

సమస్యలపై కదలిక



పాఠశాల వద్ద పారిశుధ్య పనుల్లో కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీలో పారిశుధ్య లోపం, దోమల నియంత్రణ తదితర అంశాలపై ప్రజలు 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో ప్రస్తావించగా.. అధికారుల్లో కదలిక వచ్చింది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు ఆయా అంశాలను కమిషనర్ గంగాధర్ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి గురువారం అధికారులు కదిలారు. కుమ్మరిబొగుడ, 7వవార్డులోని అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఇన్‌చార్జి శానిటరి ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని, మరికొన్ని వార్డుల్లో వారం రోజులపాటు నిరంతరం పనులు చేపడుతామన్నారు. సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంపై కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అమాత్యుని పర్యటనపై ఆశలు

- అక్టోబర్ 1న జిల్లాకు రానున్న మంత్రి కేటీఆర్
- రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవం



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు



కేటీఆర్ ప్రారంభించనున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

రామకృష్ణాపూర్(చెన్నూర్): రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మాత్యులు కల్వకుంట్ల తారక రామారావు అక్టోబర్ 1న జిల్లా పర్యటనకు రానున్నారు. ఇందులో భాగంగానే క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరుకానున్నారు. మంత్రి కేటీఆర్ పర్యటనపై రామకృష్ణాపూర్ పట్టణ ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. అంతర్గత రోడ్ల విస్తరణతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాల పంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లను లాంఛనంగా ప్రారంభించడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీకి మరిన్ని నిధులు మంజూరు చేస్తారని ఆశలు చిగురిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మంత్రి కేటీఆర్ పట్టణ పర్యటనకు వస్తుండడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రూ.40 కోట్ల వ్యయంతో పట్టణంలో అంతర్గత రోడ్ల నిర్మాణం, ప్రధాన డ్రెయినేజీలు, రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి జీవో 76 కింద ఏడో విడత ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఇందులో భాగంగా దాదాపు 1,282 మంది లబ్ధిదారులకు పట్టాలు అందనున్నాయి.

గాంధారి వనంలో కేసీఆర్ అర్బన్ పార్కు

వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలతో పాటు కేసీఆర్ అర్బన్‌పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మంచిర్యాల–నాగ్‌పూర్ జాతీయ రహదారి పక్కన బొక్కలగుట్టలో ఉన్న గాంధారివనంలో సుమారు 250 ఎకరాల్లో ఈ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కొన్ని నిధులతో పాటు టూరిజం శాఖ, డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి వెచ్చిస్తున్న సుమారు రూ.18 కోట్ల వ్యయంతో గాంధారి వనంలో పార్కు నిర్మిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇప్పటికే పలుమార్లు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి కేటీఆర్ జిల్లాకు రానున్నారు. మందమర్రిలో రోడ్‌షో అనంతరం పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, ఠాగూర్‌స్టేడియంలో సభ నిర్వహిస్తుండటంతో అధికార యంత్రాంగం, బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పునఃప్రారంభమైన రైళ్లు

- ఇంటర్ సిటీ, భాగ్యనగర్, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించిన అధికారులు



రైల్వేస్టేషన్‌కు చేరిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు

కాగజ్‌నగర్‌టౌన్: మూడు నెలలుగా రద్దయిన రైళ్లు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్ వరకు నడిచే ఇంటర్ సిటీ, సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ వరకు నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాష్ తెలిపారు. గతనెల 28 నుంచి కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను కేవలం హైదరాబాద్ నుంచి కాజీపేట వరకే నడిపించారు. మూడు నెలలుగా కాగజ్‌నగర్ వరకు భాగ్యనగర్, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రావడం లేదు. వీటిని బెల్లంపల్లి వరకే నడిపించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే మూడోలైన్ పనుల కారణంగా ఆయా రైళ్లను రద్దు చేయగా మరికొన్ని నిలిపివేశారు. మరోవైపు కాజీపేట–సిర్పూర్ టౌన్ (రామగిరి ఎక్స్‌ప్రెస్), సిర్పూర్ టౌన్–కరీంనగర్ (పుష్‌పుల్), కరీంనగర్–సిర్పూర్‌టౌన్ (పుష్‌పుల్), సిర్పూర్ టౌన్–భద్రాచలం రోడ్డు (సింగరేణి ఎక్స్‌ప్రెస్), భద్రాచలం–బల్లార్షా (సింగరేణి ఎక్స్‌ప్రెస్), బల్లార్షా–కాజీపేట (రామగిరి ఎక్స్‌ప్రెస్) రైళ్లను మూడో రైల్వేలైన్ పనుల కారణంగా ఉన్నతాధికారులు అక్టోబర్ 2 వరకు రద్దు చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే వీటిని కూడా పునరుద్ధరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సీసీఐ కైలాష్ తెలిపారు. ఇదిలా ఉండగా చెన్నై–న్యూ ఢిల్లీ ప్రధాన రైల్వేలైన్‌లో ఉన్న కాజీపేట–బల్లార్షా మధ్య మూడో రైలు మార్గం పనులు పూర్తి కాగా ఈ నెల 26, 27 తేదీల్లో కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ ప్రనజీవ్ సక్సేనా, దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం డీకే జైన్ బృందం, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పనులు తనిఖీ చేసిన అనంతరం ట్రయల్ రన్ విజయవంతమైన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారులు రైళ్ల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మూడు రైళ్లను గురువారం నుంచి పునఃప్రారంభించారు.

శిథిలావస్థలో పోస్టాఫీస్ భవనం

- పట్టించుకోని అధికారులు
- సింగరేణికి రూ.లక్షల్లో అద్దె బకాయిలు



కూలిన పోస్టాఫీస్ గది గోడ

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని కళ్యాణిఖని పోస్టాఫీస్ భవనం శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల క్రితం సింగరేణి క్వార్టర్‌లో అద్దె ప్రాతిపదికన సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేశారు. కార్యాలయంలో ఉత్తరాల బట్వాడా, చిన్న మొత్తాల పొదుపు పథకాల సేవలు, తపాలా జీవిత బీమా, బ్యాంకు, ఇండియన్ పోస్ట్ పేమెంట్ సేవలు, ఆధార్ కేంద్రం ద్వారా సేవా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. నిత్యం లావాదేవీలు, సేవా కార్యక్రమాలతో ఖాతాదారులతో రద్దీగా ఉంటుంది. కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎప్పుడు కూలుతుందోనని ఖాతాదారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.

పేరుకుపోయిన బకాయిలు..

పోస్టాఫీస్ అద్దె ఇంతవరకూ చెల్లించకపోవడంతో రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయి. సింగరేణి యాజమాన్యం నోటీసులు జారీ చేస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయింది. పోస్టాఫీస్ నిర్వాహకులు కూడా సింగరేణికి అద్దె బకాయి ఉండడంతో మరమ్మతుకోసం కూడా దరఖాస్తు చేసుకోవడం లేదని తెలిసింది. ఈ విషయమై అధికారులను సంప్రదించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్తున్నారు. పోస్టాఫీస్ బకాయి ఎంత ఉందని సింగరేణి ఎస్టేట్స్ విభాగం అధికారులను అడిగితే సరైన సమాధానం ఇవ్వడంలేదు. ఏదిఏమైనా ప్రాణనష్టం జరుగకముందే పోస్టాఫీస్ క్వార్టర్‌కు మరమ్మతు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చేతివృత్తుల వారికి చేయూత

- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



చీరలు పంపిణీ చేస్తున్న పురుషోత్తం రూపాల

దండేపల్లి(మంచిర్యాల): చేతివృత్తుల వారికి చేయూత అందించేందుకు ప్రధాని నరేంద్రమోదీ విశ్వకర్మయోజన పథకాన్ని ప్రవేశపెట్టి రూ.13 వందల కోట్లు కేటాయించారని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల తెలిపారు. దండేపల్లి మండలం పాత మామిడిపల్లిలో గురువారం వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ చేపట్టిన చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 16 చేతివృత్తుల వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల ఇన్‌చార్జి గుండ ప్రభాకర్, నాయకులు రవిగౌడ్, సత్తయ్య, సురేందర్, వంశీ, రాకేష్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడెం ఆయకట్టు రైతాంగం అధైర్యపడొద్దు

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



ఎస్‌ఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ వరదగేటుకు మరమ్మతుపనులు కొనసాగుతున్నాయని, ఆయకట్టు రైతాంగం అధైర్యపడవద్దని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. ప్రాజెక్ట్ 15వ నంబర్ గేటు కౌంటర్ వెయిట్ విరిగిపోవడంతో గురువారం ప్రాజెక్ట్ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఎస్‌ఈ సుశీల్‌కుమార్‌ను అడిగి పరిస్థితి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కడెం ప్రాజెక్ట్‌ను కట్ట మైసమ్మ తల్లే కాపాడుతుందని, ప్రాజెక్ట్ మరమ్మతుల గురించి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట ఎంపీపీ అలెగ్జాండర్, రైతులు ఉన్నారు.

బీజేపీ నేతపై మీడియాలో వైరల్

- పాత వీడియో అని కొట్టి పారేసిన వీడియోలోని వ్యక్తి

చెన్నూర్: మందమర్రి పట్టణానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, చెన్నూర్ ఇన్‌చార్జి అందుగుల శ్రీనివాస్ రియల్ ఎస్టేట్ పేరిట లక్షల రూపాయలు వసూలు చేశాడని, డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని అతని స్నేహితుడు బొడ్డు సమ్మన్న మాట్లాడిన వీడియో రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నస్పూర్, అందుగులపేట, వెంచర్లలో వాటా ఇస్తానని డబ్బులు వసూలు చేశాడని, తిరిగి అడిగితే నేను బీజేపీ పెద్ద నాయకుడిని, కాబోయే ఎమ్మెల్యేను అని చెప్పుకుంటూ బెదిరిస్తున్నాడని ఆ వీడియోలో భూమన్న చెప్పాడు. అయితే ఈవీడియోపై స్పందించిన భూమన్న అది పాత వీడియో అని తెలిపారు. గతేడాది భూమి విషయంలో నలుగురు స్నేహితులతో కలిసివెళ్లి శ్రీనివాస్‌తో మాట్లాడామని, ఆ సమయంలో తీసిన వీడియోను ఎవరో కావాలనే ఇప్పుడు వైరల్ చేస్తున్నారని పేర్కొన్నాడు. శ్రీనివాస్ తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చాడని వెల్లడించాడు. తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని తెలిపారు. ఈమేరకు భూమన్న కూడా ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఆవీడియోలో అందుగుల శ్రీనివాస్‌కు సారీ చెప్పాడు.

ఎల్లంపల్లి జలాశయం గేట్లకు లీకేజీ



గేట్ల దిగువన లీకవుతున్న నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని గోదావరిపై గల ఎల్లంపల్లి జలాశయంలోని మూడు గేట్లకు లీకేజీలు ఏర్పడ్డాయి. గేట్ల పక్కన ఉన్న పిల్లర్లు, గోడల నుంచి రంధ్రాలు ఏర్పడి నీరు లీకేజీ అవుతోంది. ప్రాజెక్ట్ గేట్ల వద్ద ఏర్పడిన మూడు రంధ్రాలతో ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని, లీకేజీ నీటిని అరికట్టేలా రానున్న వేసవిలో మరమ్మతులు పూర్తి చేస్తామని, గేట్లు తెరిచి మూసే సమయంలో రబ్బర్లు సరిగా అమరక నీరు లీకేజీ అవుతుందని ప్రాజెక్ట్ డీఈ తెలిపారు. ప్రాజెక్ట్ నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.150 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కింద శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్ట్‌ల నుంచి 23 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అవుట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్ పథకానికి 326 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి 22,500 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

లక్కీ లడ్డు..!



లక్కీడ్రాలో లడ్డు దక్కించుకున్న సౌజన్య

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని 21వ వార్డు ఎల్ఐసీ కాలనీలోని గణేశ్ మండపం వద్ద గురువారం రాత్రి నిర్వహించిన లక్కీడ్రాలో కొండ సౌజన్య ప్రసాద్ వినాయకుడి లడ్డూను దక్కించుకున్నారు. వినాయకుడి నుదుటి మీద ఉన్న వెయ్యిరూపాయల కాయిన్‌ను సాకి సుభాష్ రూ.1,32,216 దక్కించుకున్నారు. అభయ హస్తం చేతిలో ఉన్న కాయిన్ రూ.40,116కు దాసరి సాయి రేవంత్ దక్కించుకున్నారు. గర్మిళ్ల గణేశ్ మండలిలో రాయిల్ల వెంకట్‌రెడ్డి వేలంపాటలో రూ.70,116కు లడ్డూ దక్కించుకున్నారు. హరిహోం గణేశ్ మండలి వద్ద నిర్వహించిన లక్కీడ్రాలో ఈ.శ్రీనివాస్ లడ్డూ దక్కించుకున్నారు.

బీఆర్‌ఎస్‌కు జెడ్పీటీసీ రాజీనామా



నీరటి రేఖ

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల బీఆర్‌ఎస్ జెడ్పీటీసీ నీరటి రేఖ శుక్రవారం ఆపార్టీకి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఆమె భర్త జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ నీరటి సత్యనారాయణ పార్టీకి, పదవికి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 2014 నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో పని చేస్తున్నామని, 2014లో ఎంపీపీగా 2018లో జెడ్పీటీసీగా ఎన్నికై నట్లు తెలిపారు. అధికారపార్టీ నాయకులే మండల అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. తమకు పార్టీలో సముచిత స్థానం కల్పించకపోవడంతో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి తమ అనుచరులతో కలిసి ఈనెల 30న హైదరాబాద్‌లో బీజేపీలో చేరనున్నట్లు వెల్లడించారు.

'హామీలు నెరవేర్చడంలో టీబీజీకేఎస్ విఫలం'



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

నస్పూర్(మంచిర్యాల): గత సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో టీబీజీకేఎస్ విఫలమైందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంశెట్టి నరేందర్, భీం రవి ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కలవేణ శ్యాం, జాతీయ సమితి సభ్యులు భీంరావు, నాయకులు పెట్టం శ్రీనివాస్, సమ్ము రాజయ్య, జీవన్‌రావు, నర్సింగ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ లడ్డూ @ రూ.83,116



దేవాపూర్‌లో లడ్డుతో శ్రావణ్‌కుమార్

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో గురువారం వినాయకుడి చేతిలోని లడ్డూకు జరిగిన వేలంలో రూ.83,116కు శ్రావణ్‌కుమార్ దక్కించుకున్నాడు. ఎన్నడూ లేని విధంగా నవరాత్రుల సందర్భంగా గణేషుడి చేతిలోని లడ్డూకు దేవాపూర్ మైత్రి గణేష్ మండలి శ్రామికనగర్ నిర్వాహకులు వేలం పాట నిర్వహించగా అధిక మొత్తంలో పాడి సొంతం చేసుకున్నాడు.

రెండు లారీలు ఢీ..

జైపూర్(చెన్నూర్): జైపూర్ మండలం ఇందారం రాజీవ్ రహదారిపై ఐకే–1 గని మూలమలుపు వద్ద గురువారం రాత్రి రెండు లారీలు ఢీ కొన్నాయి. స్థానికులు తెలిపిన ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూర్ నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీడ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనకాలే బొగ్గు లోడుతో వస్తున్న లారీ ఢీకొట్టింది. ఘటనలో బొగ్గు లారీ డ్రైవర్ కిరణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌కు ఉత్తమ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శివకృష్ణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణకు ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం లభించింది. ఈ నెల 25 నుంచి 27వరకు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని విస్తరణ విద్యాసంస్థ(ఈఈఐ) వజ్రోత్సవాల్లో భాగంగా అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ, పర్యావరణ వ్యవస్థల కోసం కొత్త తరం వ్యవసాయ విస్తరణ విధానాలు అనే అంశంపై నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రైతుల అభ్యున్నతి కోసం పరిశోధనలు చేస్తున్న విస్తరణ విభాగపు శాస్త్రవేత్తలలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకుగానూ శివకృష్ణను పురస్కారానికి ఎంపిక చేశారు. పూర్వ ప్రణాళిక సంఘ సలహాదారు డాక్టర్ సదామతే, డీఆర్‌డీఐఎస్ చైర్మన్ డాక్టర్ వెంకురెడ్డి, విస్తరణ సంచాలకులు(పీజేటీఎస్ఏయూ) డాక్టర్ సుధారాణి, విస్తరణ విద్యాసంచాలకులు (ఈఈఐ) డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

సెమీస్‌కు చేరిన శ్రీరాంపూర్ జట్టు



శ్రీరాంపూర్ ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు

శ్రీరాంపూర్: కొత్తగూడెంలోని రుద్రంపూర్ ఏరియా మైదానంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు సెమీస్ ఫైనల్‌కు చేరింది. గురువారం మందమర్రి, బెల్లంపల్లి జట్టుకు శ్రీరాంపూర్ జట్టుకు మధ్య జరిగిన పోటీలో శ్రీరాంపూర్ జట్టు 10–0 పాయింట్ల తేడాతో విజయం సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, జట్టు మేనేజర్ తోట సురేష్, కెప్టెన్ శ్రీకాంత్ తెలిపారు. సెమీస్‌లో కూడా రాణించి ఫైనల్‌కు చేరాలని ఏరియా ఏరియా క్రీడాకారులు ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని సోమగూడెం సింగరేణి మైదానంలో గురువారం అండర్–19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మణికంత, తిరుపతి, సంతోష్, ప్రభాస్, సాయికిరణ్, విలాస్, మందమర్రి మోడల్ కళాశాల విద్యార్థులు వెంకటేశ్, శంకర్, ప్రశాంత్, మారుతి, వివేక్, అల్‌ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన కౌశిక్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఫుట్‌బాల్ కోచ్ శేఖర్, కళాశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి బాబురావు తెలిపారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2 వరకు రంగారెడ్డి జిల్లాలోని సదాశివపేటలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో సదరు విద్యార్థులు పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి

కుంటాల: పిడుగుపాటుకు రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని అంబకంటి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మహేందర్ (32)తనకున్న పత్తి చేనులో మందు పిచికారీ చేసేందుకు కూలీ ముత్యంతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం వర్షం కురియడంతో చెట్టు కిందకు వెళ్లారు. అంతలోనే పిడుగుపడడంతో మహేందర్ అక్కడికక్కడే మృతిచెందగా ముత్యంకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

30న డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో ఈ నెల 30న డివిజన్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన క్రీడాభివృద్ధి అధికారి నీలిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 17 సంవత్సరాలలోపు బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్, ఖోఖో, అర్చరీ, అథ్లెటిక్స్, చెస్, క్యారం పోటీలు నిర్వహిస్తారని, ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒక రోజుముందుగా హాజరుకావాలన్నారు.